క్లుప్తంగా

అధికారుల బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవో
కిరణ్ కుమార్

కొయ్యలగూడెం: ఎంపీడీవోగా కొమ్మా కిరణ్ కుమార్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా తణుకు నుంచి బదిలీపై వచ్చినట్లు ఆయన మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పేర్కొన్నారు. ఆయన స్వస్థలం జంగారెడ్డిగూడెం అని తెలిపారు. అదే విధంగా ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేసిన కె.శ్రీనివాసరావు బదిలీ నేపథ్యంలో కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో విధులు స్వీకరించారు.


ఎంపీడీవో
వెంకటేశ్వరరావు

టి.నరసాపురం: మండల తహసీల్దార్‌గా టి.సత్యసాయిబాబా, ఎంపీడీవోగా ఎస్.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. జంగారెడ్డిగూడెం సివిల్ సప్లై, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న టి.సత్యసాయిబాబ బదిలీపై పూర్తి అదనపు బాధ్యతలతో తహసీల్దార్‌గా శుక్రవారం బదిలీపై వచ్చారు. అలాగే పాలకొల్లు ఎంపీడీవోగా పని చేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావు టి.నరసాపురం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఉదయభాస్కర్ జంగారెడ్డిగూడెం బదిలీ కాగా, ఎంపీడీవోగా పనిచేసిన మంగాకుమారి పోడూరు ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన కమిషనర్ రమణ

జంగారెడ్డిగూడెం: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా కొమ్మని వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మిని రమణ మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శుభాకాంక్షలు తెలిపి, జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు కేవీ రమణ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే హెల్త్ అసిస్టెంట్‌గా సీహెచ్ దుర్గాప్రసాద్ బాధ్యతలు చేపట్టి, అనంతరం చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మండల పరిషత్ ఏవోగా కళ్యాణి

లింగపాలెం: మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిణిగా ఎం.కళ్యాణి బాధ్యతలు చేపట్టారు. జంగారెడ్డిగూడెంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న ఈమెను లింగపాలెం బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న మణికుమారి టి.నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఎంపీడీవోగా జ్యోతి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం ఎంపీడీవోగా కె.జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీరవాసరం ఎంపీడీఓగా పని చేస్తున్న జ్యోతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న ఎస్.వేణుగోపాలరెడ్డి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన జ్యోతికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

జీలుగుమిల్లి ఎంపీడీఓగా వెంకటలక్ష్మి

జీలుగుమిల్లి ఎంపీడీఓగా కె.వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. భీమవరం ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పోరాట ఫలితంగా ఆశ వర్కర్ విధుల్లోకి

కుక్కునూరు: సీఐటీయూ పోరాటాల ఫలితంగానే టి.నర్సాపురం ఆశ వర్కర్ లక్ష్మీమంగను ప్రభుత్వం మరల విధుల్లోకి తీసుకోబోతుందని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. ఆశ వర్కర్ లక్ష్మీమంగ అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా ఆశాలు ధర్నా చేయడంతోనే ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకున్నారన్నారు.

జాతీయ బృందం పర్యటన

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై ఢిల్లీకి చెందిన నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ (ఎన్ఎల్ఎం) బృందం సభ్యులు క్షేత్రపర్యటన చేశారు. పోలవరం మండలం ప్రగఢపల్లి , జిల్లెళ్ల గూడెం గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణ సంస్థ, ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు సూర్యచంద్ర అశోక్‌లు శుక్రవారం పర్యటించారు. వీరి వెంట ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై వెంకన్న తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి షాక్

వేంకటేశ్వరుడే చంద్రబాబుకు బుద్ధి చెప్తాడంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బుట్టాయగూడెం: తిరుమల లడ్డూ ప్రసాదంపై ఏపీ సీఎం చంద్రబాబుకు సుప్రీం కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తిరుమల లడ్డూ వివాదంపై దాఖలైన పిటిషన్లు విచారించిన సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసింది. తిరుమల లడ్డూ అపవిత్రమయ్యిందంటూ చంద్రబాబునాయుడు ఆరోపణ చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరిచే విధంగా బాబు వ్యవహరిస్తున్నారని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అయితే స్వార్థ రాజకీయాల కోసమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మతాలను రెచ్చగొట్టే విధంగా అసత్య ప్రచారానికి తెరలేపారని పలువురు విమర్శిస్తున్నారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇటు చంద్రబాబు, అటు పవన్ కళ్యాణ్ సీబీఐ విచారణ కోరకుండా చంద్రబాబు ప్రభుత్వంతో సిట్ ఏర్పాటు చేసి, గత ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అయితే టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టులో కేసు వేశారు. దీంతో విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల కోసం చంద్రబాబు దేవుడినే అడ్డంపెట్టుకున్నాడని ఆ దేవుడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు తగిన గుణపాఠం చెప్తాడంటూ పలువురు విమర్శిస్తున్నారు.

హామీలు అమలు చెయ్యలేక లడ్డూ రాజకీయం

ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను ప్రజలకు ఇస్తామంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వ పాలకులు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు లడ్డూ రాజకీయం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. చెయ్యని తప్పును చేశారంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు లడ్డూ వ్యవహారాన్ని లేవనెత్తినప్పటికీ వెంకటేశ్వర స్వామి సుప్రీం కోర్టు న్యాయమూర్తుల రూపంలో కూటమి ప్రభుత్వానికి షాక్ ఇచ్చారని పలువురు విమర్శిస్తున్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పడం ఖాయం



కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరం. కనీసం వాస్తవాలు తెలుసుకోకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా బాబు ప్రవర్తించారు. సుప్రీం కోర్టు నిర్ణయం సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరస్వామే జడ్జిలతో పలికించినట్లుగా ఉంది. త్వరలోనే అన్ని విషయాలు బయటకు రావడం ఖాయం. నీచ రాజకీయాలు చేసే వారికి దేవుడు బుద్ధి చెప్పడం ఖాయం.

సుంకర వెంకటరెడ్డి, ఎంపీపీ, పోలవరం మండలం

చంద్రబాబు అసలు రంగు బయటకు వస్తుంది



కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చేసిన అసత్య ప్రచారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో చంద్రబాబు అసలు రంగు బయటకు వస్తుంది. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేకే వారి దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు అండ్ కో లడ్డూ ఆరోపణలు చేస్తున్నారు.

సుర్లా రాము, కుక్కునూరు

ప్రజాప్రతినిధులు ప్రజల మధ్యే ఉండాలి


వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ అధినేత సూచన

కొయ్యలగూడెం: ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య గడుపుతూ వారి సమస్యల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని కొయ్యలగూడెం జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. 3వ తేదీ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జెడ్పీటీసీల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి తాను పాల్గొన్న సందర్భంగా అధినేత దిశానిర్దేశం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల హామీల అమలులో ఘోరంగా విఫలం చెందిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే ఉద్దేశ్యంతో ఉన్నారని వారిలో ధైర్యాన్ని నింపి అండగా నిలబడాల్సిందిగా సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాల వలన కలిగిన ప్రయోజనాలను ప్రజలు గుర్తు చేసుకుంటూ మళ్లీ మన ప్రభుత్వరాక కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లడ్డూ వ్యవహారంపై ఒక్కొక్కటిగా ప్రజలకు నిజాలు తెలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా శ్రీవారి మెమొంటోను మాజీ ఎమ్మెల్యే బాలరాజు, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జిలతో కలిసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అందజేశామన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు


జీవామృతం తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కామవరపుకోట: సేంద్రియ వ్యవసాయంతో పెట్టుబడి తగ్గి, రైతులు అధిక లాభాలు పొందొచ్చని మండల ఉద్యానవన శాఖ అధికారి జి.లక్ష్మపతి తెలిపారు. మండలంలో ఆడమిల్లిలో రైతు మలకపల్లి వీర రాఘవయ్య వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఏలూరు జిల్లా ఎన్ఎఫ్ఏఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై ఈసీఆర్‌పీ బృందానికి శిక్షణ నిర్వహించారు. ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో, వక్కతో పాటు ఉద్యాన వన పంటలు, కూరగాయలు, అల్లం, మామిడి అల్లం, మసాలా దినుసుల మొక్కలు, తీగజాతి వంటి దేశీ రకాల పంటల పరిరక్షణ కోసం అనుసరిస్తున్న వేరు వేరు యాజమాన్య పద్ధతులను బృందం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్లు షేక్ నవీన్నా, బి.దుర్గాదేవి, యూనిట్ ఇన్‌చార్జి ఆర్.భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పెరటి మొక్కలతో ఫలసాయాన్ని పొందండి


గిరిజన రైతులకు కూరగాయ విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్త కరుణశ్రీ

పోలవరం రూరల్: ప్రతీ ఒక్కరు ఇంటి ఆవరణలో పెరటి మొక్కలు పెంచి, ఫలసాయాన్ని పొందాలని కేంద్రీయ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ అన్నారు. పోలవరం మండలం కొండ్రుకోట గ్రామ పంచాయతీ పరిధిలోని 250 కుటుంబాలకు కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. నిర్వాసిత గ్రామాల్లోని గిరిజన రైతులు ఎన్నో త్యాగాలు చేశారన్నారు. పునరావాస కేంద్రాల్లో వారి జీవన విధానం ఇబ్బందికరంగా ఉందని అందువల్ల ఏదైనా చేయాలనే సంకల్పంతో 12 రకాల విత్తనాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైదా నాగరాజు, బి.ముక్కయ్య, తామా రాజు, ఎం.సిలోమాన్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి అంబరుఖానాకు సామగ్రి బహూకరణ


శ్రీవారి అంబరుఖానాలో సామగ్రితో దాతలు, ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ప్రసాదాల తయారీ కేంద్రం (అంబరుఖానా)కు ఒక ప్రైవేట్ కంపెనీ శుక్రవారం రూ.5 లక్షలు విలువైన సీమవెండి, స్టీల్ సామగ్రిని బహూకరించారు. ఏలూరుకు చెందిన షణ్ముఖ ఫైనాన్స్ కంపెనీ వారు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబరుఖానాకు వెళ్లి ప్రసాదాల తయారీకి వినియోగించే వంట పాత్రలను ఆలయ డీఈఓ బాబురావు, సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్, గుమస్తా పూళ్ల నరసింహారావులకు అందజేశారు. దాతల సమక్షంలో ఆ పాత్రల్లో లడ్డూ ప్రసాదాలను తయారు చేశారు.

పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలు

- పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలు
- ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం డిమాండ్
- పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు


చింతలపూడి: రెవెన్యూ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



బుట్టాయగూడెం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చింతలపూడి: ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు కావస్తున్నా నేటికీ ఉచిత ఇసుక విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని సీపీఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ చింతలపూడి రెవెన్యూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుడు ఆర్.ధర్మారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేస్తూ ఉచిత ఇసుకను ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మొడియం నాగమణి, ఏ. ఫ్రాన్సిస్, ముత్యాలరావు, కోర్సా జలపాలు, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, గిరిజన జ్యోతి నాయకులు కూరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని, ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వంద రోజులు దాటినా ఇసుక సరఫరా లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు నిలిచిపోయాయని, దీని వల్ల భవన నిర్మాణ రంగంలో 180 రకాల కార్మికులు రోడ్డున పడ్డారని ఇది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం చేతగాని తనమేనని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ వాగ్దానం అమలు చేయాలని పలుమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన కురిసినట్టు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బొడ్డు రాంబాబు, జోడే సూర్యచంద్రరావు, అందుగుల ప్రభాకర్ రావు, యాగంటి సీత, టౌన్ కన్వీనర్ సూర్యరావు, ఎస్‌కే సుభాషిని, సీహెచ్ మాణిక్యాలరావు, జీలుగుమిల్లి మండల కార్యదర్శి టి.దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, జీవీఎల్ నరసింహారావు, తదితరులు పాల్గొని ధర్నా నిర్వహించారు.



కుక్కునూరు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు


కొయ్యలగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పేరుకే ఫ్రీ ఇసుక

కుక్కునూరు: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక విధానం పేరుకే తప్ప ఆచరణలో అమలులో లేదని పేర్కొంటూ సీపీఎం నాయకులు శుక్రవారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం పేరుకే తప్ప ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. ఉచితం పేరుతో ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే ఇసుక ధరను విపరీతంగా పెంచి ఇసుకను అందుబాటులో లేకుండా చేసిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పట్ల లక్ష్మయ్య,పూలదాసు రమేష్, ఎస్‌కే మహబూబ్‌పాషా, ఎండి పుల్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

కొయ్యలగూడెం: ఉచిత ఇసుక విధానం పేరుతో ధరలు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇసుక ధర పెంచి అందుబాటులో లేకుండా చేసి భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని సరళీకరించి అందరికీ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెల్లారి నాగరాజు, ఎం.సతీష్, ఇల్ల శ్రీను, చిల్లా రామచంద్రం, పంది దాసు, జి.గోపి, చెరుకూరి మరిడియ, మర్రి త్రిమూర్తులు, మర్రి సుబ్రమణ్యం, ఉండి లూథియ పితాతారావు, యస్ కెల్లీ తదితరులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉచిత ఇసుక ఇవ్వకపోవడం దారుణం

ద్వారకాతిరుమల: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక పథకం హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమని సీపీఎం పార్టీ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు కట్ట భాస్కరరావు, ఆది కృష్ణ, బండారు శివాజీ, శ్రీనివాసు తదితరులున్నారు.

కనకదుర్గమ్మ పలు అవతారాల్లో దర్శనం

రెండో రోజు ఘనంగా దసరా ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. గంగానమ్మ అమ్మవారు దసరా నవరాత్రుల సంబరాల్లో గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దండమూడి ప్రసాద్ దంపతులు, చిట్లూరి హనుమాన్ దంపతులు, వసుంధర హాస్పిటల్ సత్యనారాయణ దంపతులు, సూర్య స్వీట్స్ రాము దంపతులు, భక్తాంజనేయ స్వీట్స్ రాంబాబు దంపతులు, చాపర్తి కుమారిలు ఉభయదారులుగా పూజా కార్యక్రమములు నిర్వహించారు.

కొయ్యలగూడెం: శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం కనకదుర్గమ్మ మండలంలోని పలుచోట్ల విశేష అలంకరణలతో పూజలు అందుకుంది. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం గ్రామాలలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమను వేదమాత్ర గాయత్రీ దేవి అలంకరణతో పూజలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలో కొలువైన అమ్మవార్లు వివిధ దేవతా మూర్తుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చింతలపూడి: విశ్వనాథ మఠంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమంలో వేంచేసియున్న రాజరాజేశ్వరిని శుక్రవారం భక్తులు గాయత్రీదేవిగా అలంకరించారు. ఆశ్రమానికి వచ్చే భక్తులకు దేవాదాయశాఖ అధికారులు, ఆశ్రమం నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

లింగపాలెం: లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు శుక్రవారం దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని గాయత్రీదేవి అవతారంలో అలంకరించారు. కనకదుర్గమ్మకు ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


జంగారెడ్డిగూడెం: గాయత్రీదేవి అలంకరణలో


ద్వారకాతిరుమల: గాయత్రీ దేవిగా క్షేత్ర దేవత


చింతలపూడి: విశ్వనాథ మఠంలో గాయత్రీదేవిగా


కొయ్యలగూడెం: ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ విగ్రహం


కామవరపుకోట: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


లింగపాలెం: గాయత్రీ దేవిగా అలంకరణ


పోలవరం రూరల్: గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ

పోలవరం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి గాయత్రిదేవి అలంకరణలో పూజలు నిర్వహించారు.

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శుక్రవారం వేదమాత శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కామవరపుకోట: దేవీ నవరాత్రులలో భాగంగా స్థానిక అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎ.వరప్రసాద్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.